ఫొటోలు, వీడియోల కింద లింక్‌లు క్లిక్ చేస్తే హ్యాకే!

- సైబర్‌క్రైమ్ పోలీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు ఫొటోలు, వీడియోల కింద లింకులు జోడించి వాట్సాప్, ఫేస్‌బుక్‌లను హ్యాక్ చేస్తున్నారు. ఈ తరహా మోసాలపై ప్రతి రోజు మూడు, నాలుగు ఫిర్యాదులు సైబర్ ఠాణాల్లో నమోదవుతున్నాయి. ఇటీవల బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఫేస్‌బుక్ కూడా ఇలాగే సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నట్టు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అనుమానిస్తున్నారు. ఫొటోలు, వీడియోల కింద వచ్చే లింక్‌పై క్లిక్ చేస్తే వాట్సాప్, ఫేస్‌బుక్ వాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతాయి. బాధితుల నంబర్‌తోనే అందులో ఉన్న ఫోన్ నంబర్లకు డబ్బులు అర్జంట్ అని సందేశాలు పంపి మోసగిస్తున్నారు. ఇలాంటి కేసులు సైబర్ క్రైమ్ ఠాణాకు ఎక్కువగా వస్తున్నాయని ఏసీపీ చాంద్‌పాషా వెల్లడించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే ఫొటోలు, వీడియోలను క్లిక్ చేయవద్దని సూచించారు.

తిరుమలలో ప్రాంక్ వీడియోలు

- భక్తులపై అకతాయిల వెర్రిచేష్టలు
- విచారణకు ఆదేశించిన టీటీడీ

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అకతాయిలు ప్రాంక్ వీడియోలు తీయడం తీవ్ర కలకలం సృష్టించింది. వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకులు తిరుమల లోపల ప్రాంక్ వీడియో కోసం.. నారాయణగిరి షెడ్స్‌లోని క్యూలో వెళ్తూ మరో కంపార్టుమెంట్ తాళాలు తీసే ఉద్యోగిలా కలరింగ్ ఇచ్చారు. భక్తులు ఆ వ్యక్తిని టీటీడీ ఉద్యోగిగా భావించి ఒక్కసారిగా పైకి లేచారు. వెంటనే సదరు యూట్యూబర్ కంపార్ట్‌మెంట్ నుంచి నవ్వుతూ పరుగులు తీశాడు.ఇదంతా మరో యువకుడు వీడియో తీశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పలువురు నెటిజన్లు టీటీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియోలపై టీటీడీ తీవ్రంగా ఖండించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. తిరుమల ఆలయంలోకి ఫోన్ ఎలా తీసుకెళ్లారు? అనేది తెలియాల్సి ఉంది.

ఫోన్‌ట్యాపింగ్ కేసులో మూడోసారి బెయిల్ పిటిషన్లు

నాంపల్లి కోర్టులు, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల తరపున గురువారం మూడోసారి డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా నిందితుల తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బెయిల్ పిటిషన్లను దాఖలు చేసినప్పుడు కోర్టు ఎదుట చార్జిషీట్ లేదని, అనివార్య కారణాల వల్ల దానిని కోర్టు వెనక్కి పంపిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు కోర్టు చార్జిషీట్‌ను అంగీకరించలేదని తెలిపారు. చార్జిషీట్‌తోపాటు అందులో పేర్కొన్న వస్తువులను పోలీసులు కోర్టుకు సమర్పించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. విచారణ అధికారి తప్పుల వల్ల రిమాండ్ ఖైదీలుగా నిందితులకు 120 రోజులు పూర్తయ్యాయని గుర్తుచేశారు. బెయిల్ పిటిషన్లపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యంతరం తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత డిఫాల్ట్ బెయిల్‌కు అవకాశం లేదని అన్నారు. రెండుసార్లు డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన నేపథ్యంలో మరోసారి దాఖలు చేయడానికి వీలులేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు తెలుపుతున్నాయని చెప్పారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు తీర్పును శుక్రవారానికి రిజర్వు చేస్తున్నట్టు ప్రకటించింది. అంతకుముందు వెస్ట్ జోన్ డీసీపీ విజయకుమార్, విచారణాధికారి, ఏసీపీ వెంకటగిరి, పీపీ సాంబశివారెడ్డి మేజిస్ట్రేట్ చాంబర్‌లోకి వెళ్లడంపై డిఫెన్స్ న్యాయవాది సురేందర్‌రావు అభ్యంతరం చెప్పారు. దీనిపై మేజిస్ట్రేట్ స్పందిస్తూ.. కోర్టు నిందితుల పక్షానే నిలబడుతుందని చెప్పారు.

న్యాయం కోసం డీజీపీ ఆఫీస్‌కు!

- భారీగా వస్తున్న బాధితులు
- పోలీస్‌స్టేషన్లపై అవినీతి ఆరోపణలు
- న్యాయం చేస్తలేరని ఆక్రోషాలు
- భూ వివాదాల్లోనూ తలదూరుస్తున్నవైనం

హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి వచ్చిన బాధిత కుటుంబీకులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరగడం లేదని బాధితులు ఏకంగా పోలీసు కేంద్ర కార్యాలయానికి క్యూ కడుతున్నారు. పోలీసులు బాధితుల వైపున కాకుండా.. నిందితుల వైపున నిలబడుతున్నారని, తమకు డీజీపీ న్యాయం చేయాలని గోడు వెల్లబోసుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుల్ నుంచి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ వరకు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు తీసుకుని నిందితులకు వత్తాసు పలుకుతూ బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మండల పోలీస్‌స్టేషన్ నుంచి, సీఐ కార్యాలయం, డీఎస్పీ ఆఫీసు, ఆఖరికి ఎస్పీ ఆఫీసుల్లో కూడా పట్టించుకోవడం లేదని, ఏకంగా డీజీపీ ద్వారానే న్యాయం జరుగుతుందని.. హైదరాబాద్ వరకూ వస్తున్నారు. డీజీపీ ఆఫీసు వరకూ వచ్చిన బాధితులకు తాత్కాలిక ఉపశమనం దొరికినా.. కొన్ని కేసుల్లో అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియని అయోమయంలో కొందరు బాధితులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల ఓ బాధితురాలు ఓ రియల్ ఎస్టేట్ కుంభకోణంలో డబ్బులు కోల్పోయి.. వాటిని ఇప్పించాలని డీజీపీ కార్యాలయంలోకి ఏకంగా పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె తీసుకొని రావడం కలకలం సృష్టించింది. డీజీపీతో ఆమె గోడు వెలిబుచ్చినా.. నేటికీ న్యాయం జరగలేదని తెలిసింది.

కాంగ్రెస్ నేతలతో కుమ్మక్కయ్యారయ్యా..!

కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన మందా విను అనే యువకుడు జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షలతో అతని స్నేహితులే మేడారం జాతరకు తీసుకుపోయి చంపేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు డబ్బులు తీసుకొని నిందితుల వైపే మాట్లాడుతున్నారని విను తల్లిదండ్రులు డీజీపీ ఆఫీసులో కన్నీటి పర్యంతమయ్యారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండ ఉండి తమకు అన్యాయం చేస్తున్నారని భోరున విలపించారు. ఫోన్ మెమోరీ కార్డులు, డేటా డిలీట్ చేసి, రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని, ఈ కేసును కొట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని, డీజీపీ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల అప్పటి డీజీపీ రవిగుప్తాకు చొప్పదండి నుంచి వచ్చిన బాధితులు కలువలేకపోయారు. డీజీపీ పేషీలో బాధితుల లెటర్‌ను తీసుకొని.. మల్టీజోన్-1 ఐజీకి పంపుతున్నట్టు రిసిప్ట్ ఇచ్చారు. ఈ కేసులో ఎలా స్పందిస్తారో చూడాలి.

భూ సమస్యల్లోకి పోలీసులు..

భూ సమస్యల్లో పోలీసులు తలదూర్చి నిందితుల పక్షాన మాట్లాడుతున్నారనే వాదనలు బాగా వినిపిస్తున్నాయి. నారాయణపేట జిల్లా ఉట్కూరులో ఇటీవల జరిగిన ఓ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గొడవ మొదలైనప్పుడే బాధితులు డయల్ 100కు కాల్ చేయగా.. ఎస్సై, సీఐ పట్టించుకోలేదు. హత్య జరిగిన తర్వాత కానిస్టేబుళ్లను పంపించారు. మహబూబ్‌నగర్‌లో చెంచు మహిళ ఉదంతం అందరికీ తెలిసిందే.చెంచుల భూమి కొట్టేసేందుకు కౌలు చేస్తున్నవారే దాడి చేయడం, బాధితురాలి మామను హత్య చేయడం కలవరపెట్టే విషయం. భూమి పంచాయితీల్లో పోలీసులు సరైన సమయంలో స్పందించకపోవడంతో బాధితులు డీజీపీ ఆఫీసు వరకు వస్తున్నారు. భూ సమస్యల్లో పోలీసులు తలదూర్చి న్యాయం చేయడం లేదని మంగళవారం డీజీపీకి కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. ఓ హత్య కేసులో ఇంతవరకూ తమకు న్యాయం జరగలేదని మరో బాధిత కుటుంబం 'నమస్తే తెలంగాణ'తో వాపోయింది.

పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి దేవాలయంలో ఉన్న వేణుగోపాలుడి విగ్రహం

అరుదైన వేణుగోపాల స్వామి శిల్పం గుర్తింపు

హైదరాబాద్, జూలై 11(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని దేవాలయంలో అరుదైన వేణుగోపాలస్వామి శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, కుందారపు సతీశ్ తదితరులు గుర్తించారు.

ఉస్మానియా మెడికల్ కాలేజీలో లైంగిక వేధింపుల కేసులో స్టే

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా మెడికల్ కాలేజీలో విద్యార్థిని మీద జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) సమర్పించిన రెండు వేర్వేరు రిపోర్టుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఫిర్యాదు ప్రతులు, నివేదిక కాపీలను ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని అంతర్గత కమిటీ చైర్మన్, సభ్యులు, డీఎంఈ, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లను కోర్టు ఆదేశించింది. వారంతా కౌంటర్ దాఖలు చేయాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. లైంగిక వేధింపులకు గురైనట్టు ఫిర్యాదు చేసిన విద్యార్థినిని కూడా ప్రతివాదిగా చేర్చాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళ, పురుష విద్యార్థులు, నర్సు, శాఖాధిపతి అయిన మాజీ ప్రొఫెసర్లు హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు స్టే అమల్లో ఉంటుందని పేర్కొంటూ.. తదుపరి విచారణను ఈనెల 30వ తేదీకి కోర్టు వాయిదా వేసింది.

డాటాసైన్స్‌తో ప్రజా రవాణా పటిష్టం

- డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ నిపుణుడు శరత్

హైదరాబాద్, జూలై 11 (నమస్తే తెలంగాణ) : డాటాసైన్స్‌తో ప్రజా రవాణాను పటిష్టం చేయవచ్చని డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ నిపుణుడు శరత్ కాటిపల్లి అన్నారు. లీడర్‌షిప్ టాక్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ బస్‌భవన్‌లో నిర్వహించిన 'ప్రజారవాణా వ్యవస్థలో డాటాసైన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం' అంశంపై శరత్ ప్రసంగించారు. డాటాకు అనుగుణంగా రియల్ టైమ్‌లో మెరుగైన రవాణా సేవలను అందించవచ్చని తెలిపారు. మెసేజ్, మెసెంజర్, మెకానిక్స్, మెషినరీ కాన్సెప్ట్స్‌తో సంస్థను ఉన్నతస్థాయికి ఎలా తీసుకెళ్లవచ్చో వివరించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. డాటాసైన్స్‌తో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు టీజీఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో రవీందర్, జేడీ అపూర్వారావు, ఈడీ మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, ఉషారాణి, వెంకన్న, ఆర్ఎంలు, డీఆర్ఎంలు, డీఎంలు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

హిమాయత్‌నగర్,జూలై11: గ్రామ పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను తక్షణమే మంజూరు చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ప్రధాన కార్యదర్శి పీ అరుణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సూర్యం డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం హిమాయత్‌నగర్‌లోని పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధి కల్పన కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో వేలాది మల్టీపర్పస్ వర్కర్లు వెట్టిచాకిరి చేస్తున్నా రని, జీవో నం 60 ప్రకారం వీరికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకట్, నర్సింలు, వెంకట్రాములు, రాఘవేందర్, రాందాస్, సాంబ శివుడు, రాజు, గట్టమ్మ, సుబ్బయ్య, రాములు, ఎల్లమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమరాల్డ్ మస్తు కల్తీ!

- ఆర్గానిక్ ఉత్పత్తుల మాటున ప్రమాదకర మిఠాయిలు
- జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సిటీబ్యూరో, జూలై 11 (నమస్తే తెలంగాణ): ఎమరాల్డ్ స్వీట్స్.. సూపర్ హెల్తీ గురూ..ఇది పాతమాట. ఎమరాల్డ్ స్వీట్స్.. మస్తు కల్తీ గురూ నేటిమాట. ఆర్గానిక్ ఉత్పత్తుల మాటున కల్తీ పదార్థాలతో మిఠాయిలను అందిస్తున్నట్టు జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీలో తేలింది. హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్కు దగ్గర ఉన్న ఎమరాల్డ్స్ స్వీట్‌హౌస్‌పై గురువారం జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రమాదకరమైన కలర్స్ మిక్స్ అయిన 60 కేజీల బెల్లం, సరిగాలేని మూడు కిలోల జీడి పప్పును సీజ్ చేశారు. గడువు ముగిసిన పాలు, పెరుగు చూసి అధికారులు అవాక్కయ్యారు. ఫుడ్ లైసెన్స్ డిస్‌ప్లే పెట్టలేదని, మెడికల్ సర్టిఫికెట్లు లేని ఫుడ్ హ్యాండిలర్లను గుర్తించారు. శాంపిల్స్‌ను తీసుకున్న అధికారులు ల్యాబ్‌కు తరలించి, ఎమరాల్డ్స్ స్వీట్ షాపు నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు.

రాజ్‌నాథ్‌కు అస్వస్థత

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అస్వస్థతకు గురయ్యారు. అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించడంతో ఆయనను గురువారం ఉదయం ఎయిమ్స్‌లోని న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్‌లో చేర్పించారు. ఎయిమ్స్ మీడియా సెల్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ రీమా దాదా తెలిపిన వివరాల ప్రకారం, రాజ్‌నాథ్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆయనను వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. నడుము నొప్పి రావడంతో ఆయనను ఎయిమ్స్‌లో చేర్పించారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు చెప్పబోతున్నది. ఢిల్లీ మద్యం విధానం కేసులో తనను ఈడీ అరెస్ట్ చేయడాన్ని ఆయన సవాల్ చేశారు. ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ ఆరోపించింది. ఈ పిటిషన్‌పై వాదనలు ముగిసిన తర్వాత తీర్పును సుప్రీంకోర్టు మే 17న రిజర్వు చేసింది.

చైనా నుంచి పాక్‌కు నిషేధిత రసాయనాలు!

- తమిళనాడులో సీజ్ చేసిన కస్టమ్స్ అధికారులు

చెన్నై, జూలై 11: నిషేధిత రసాయనాలు ఉన్న చైనా కార్గో కంటైనర్‌ను తమిళనాడులోని కట్టుపల్లి ఓడరేవు వద్ద కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ జీవ, రసాయన యుద్ధం కోసం ఈ రసాయనాలను చైనా పంపుతున్నట్టు కస్టమ్స్ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. టియర్‌గ్యాస్‌గా వాడే (ఆర్థో క్లోరో బెంజైలిడిన్ మాలోనోనిట్రైల్) కెమికల్ చైనా కంటైనర్‌లో పెద్ద మొత్తంలో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అల్లర్లు, నిరసనల్ని నియంత్రించటానికి, సైనికపరంగానూ వాడొచ్చునని వారు తెలిపారు. రావల్పిండిలోని రక్షణ ఉత్పత్తులను సరఫరా చేసే సంస్థకు రసాయనాలను పంపుతున్నట్టు అధికారులు గుర్తించారు.

మళ్లీ రైతుల పోరుబాట

- దేశవ్యాప్త నిరసనలకు సమాయత్తం
- ఎంఎస్పీకి చట్టబద్ధత, రుణమాఫీ తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 11: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) గురువారం ప్రకటించింది. 2020-21లో కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టిన రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను ఎస్కేఎం గురువారం ప్రకటించింది. మళ్లీ ఉద్యమాన్ని పున:ప్రారంభించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నది. ముఖ్యంగా పంటల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్టు తెలిపింది. 2021 డిసెంబర్ 9న రైతు సంఘాలతో జరిగిన చర్చల్లో కేంద్రం చేసుకున్న ఒప్పందంలోని అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేసింది. జూలై 16 నుంచి 18 వరకు ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత సహా ఎంపీలందరినీ కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించనున్నట్టు తెలిపింది. ఉద్యమం సమయంలో మరణించిన అన్నదాతల గౌరవార్థం ఢిల్లీ సరిహద్దుల్లోని టిక్రి, సింఘు వద్ద స్మారకాలను నిర్మించనున్నట్టు వెల్లడించింది. అలాగే 2021లో ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపూర్ ఖీరీలో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా కాన్వాయ్ దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయిన అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

ఈసారి దేశవ్యాప్త ఉద్యమం

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నుంచి భారత్ బయటకు రావాలని, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలను అనుమతించవద్దని ఎస్కేఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 9న 'క్విట్ ఇండియా డే'ను 'కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే'గా నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా తమ డిమాండ్ల సాధనకు ప్రదర్శనలు నిర్వహిస్తామని ప్రకటించారు. తమ డిమాండ్ల సాధనకు ఇక కొత్త పద్ధతుల్లో ఉద్యమాన్ని నడిపించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈసారి ఢిల్లీకి ర్యాలీ చేపట్టడం కాకుండా దేశవ్యాప్త నిరసనలు తెలుపుతామని, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్, హర్యానా రాష్ట్రాలపై ప్రధాన దృష్టి సారిస్తామని ఎస్కేఎం నేతలు ప్రకటించారు.

తెరుచుకోనున్న రత్న భాండాగారం

అధికారులకు పాముల భయం

పూరీ: ఒడిశాలోని పూరీలో ఉన్న శ్రీ జగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారాన్ని ఈ నెల 14న తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రహస్య గదిలోని ఐదు పెట్టెల్లో ఉన్న అమూల్యమైన ఆభరణాలను లెక్కించబోతున్నారు. ఆ సమయంలో అనుసరించవలసిన మార్గదర్శకాలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అయితే పురాతన దేవాలయాల్లోని ఖజానాలకు పాములు కాపలా ఉంటాయనే విశ్వాసం ఉండటంతో అధికారులు భయాందోళనలతో గడుపుతున్నారు. పాములు పట్టడంలో నిపుణులను, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. 1978 తర్వాత రత్న భాండాగారాన్ని తెరవబోతుండటం ఇదే మొదటిసారి.

నీట్‌పై విచారణ జూలై 18కి వాయిదా

పేపర్ లీక్ సూత్రధారి రాకీ అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 11: నీట్-యూజీ పరీక్షలో అక్రమాలపై విచారణను జూలై 18కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలపై విచారణ జరిపించాలని, పరీక్షను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను కలిపి సుప్రీంకోర్టు విచారిస్తున్నది. ఈ పిటిషన్లపై స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం, పరీక్ష నిర్వహించిన జాతీయ పరీక్ష సంస్థ(ఎన్టీఏ)ను ఇంతకుముందు కోర్టు ఆదేశించింది. బుధవారం కేంద్రం, ఎన్టీఏ వేర్వేరుగా స్పందనను తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేశాయి. గురువారం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశంపై విచారణ ప్రారంభించింది. పరీక్షలో అక్రమాలపై సీబీఐ జరుపుతున్న విచారణ పురోగతిపై తమకు నివేదిక అందినట్టు కోర్టు పేర్కొన్నది. అయితే, తమకు కేంద్రం, ఎన్టీఏ దాఖలు చేసిన అఫిడవిట్లు అందలేదని పలువురు పిటిషన్‌దారులు ధర్మాసనానికి తెలిపారు. దీంతో జూలై 15కు విచారణ వాయిదా వేస్తామని ధర్మాసనం చెప్పింది. అయితే, ఆ రోజు తాను అందుబాటులో ఉండనని కేంద్ర ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. దీంతో విచారణను జూలై 18కి కోర్టు వాయిదా వేసింది. కాగా, నీట్‌లో సామూహిక మాల్‌ప్రాక్టీస్ జరగలేదని, కాబట్టి మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

సూసైడ్ క్యాప్సూల్‌పై స్విట్జర్లాండ్ నిషేధం

బెర్న్, జూలై 11: క్షణాల్లో ప్రాణాలు తీసేసే సూసైడ్ క్యాప్సూల్‌ను స్విట్జర్లాండ్ నిషేధించింది. ఎగ్జిట్ స్విట్జర్లాండ్ అనే కంపెనీ సార్కోఫాగస్ పేరుతో ఈ మెషీన్‌ను తయారుచేసింది. కారుణ్య మరణం పొందాలనుకునే వారి కోసం దీనిని తయారుచేశారు. ఈ మెషీన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని దీనిని తయారుచేసిన డాక్టర్ ఫిలిప్ నిట్స్‌ఖే జూన్ 10న ప్రకటించారు. అయితే, ఈ సూసైడ్ క్యాప్సూల్ వల్ల దుష్పరిణామాలు ఉంటాయని భావించిన స్విట్జర్లాండ్ ప్రభుత్వం దీనిపై నిషేధం విధించింది. ఏదైనా భరించలేనంత అనారోగ్య సమస్యను అనుభవిస్తున్న వారు సులువుగా కారుణ్య మరణం పొందేందుకు ఈ క్యాప్సూల్ ఉపయోగపడుతుందని దీనిని తయారుచేసిన కంపెనీ చెప్పున్నది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు ఈ క్యాప్సూల్‌లో కూర్చోగానే మెషీన్.. ఎవరు నువ్వు?, ఎక్కడ ఉన్నావు?, ఈ బటన్ నొక్కితే ఏమవుతుందో తెలుసా? అనే మూడు ప్రశ్నలు అడుగుతుందని డాక్టర్ ఫిలిప్ చెప్తున్నారు. ఈ ప్రశ్నలకు వారు సమాధానాలు చెబితే మెషీన్ ప్రారంభమవుతుందని, అప్పుడు బటన్ నొక్కవచ్చని తెలిపారు. బటన్ నొక్కిన 30 సెకన్లలో ఇందులో ఆక్సిజన్ శాతం 21 నుంచి 1 శాతానికి పడిపోయి క్షణాల్లో మనిషి మరణిస్తాడని చెప్పారు. అయితే, ఈ క్యాప్సూల్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో నిషేధిస్తూ స్విట్జర్లాండ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం

బీజింగ్, జూలై 11: చైనాలో కలుషిత వంట నూనెల కుంభకోణం..సంచలనం రేపుతున్నది. ఇంధనాన్ని (బొగ్గు ఆయిల్) స్టోరేజ్ చేసే ట్యాంకర్లలో వంట నూనెలను నింపి..సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఆహార భద్రతపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. దీంతో చైనా ప్రభుత్వ రంగ కంపెనీలు తయారుచేసిన వంట నూనెల అమ్మకాలను ఆన్‌లైన్ స్టోర్లు నిలిపివేస్తున్నాయి. ఆ కంపెనీల ఉత్పత్తులను తొలగిస్తున్నాయి. ట్యాంకర్లలో కోల్ ఆయిల్‌ను అన్‌లోడింగ్ చేసిన వెంటనే, స్టోరేజ్ ట్యాంకర్లను శుభ్రం చేయకుండా.. సోయాబీన్ ఆయిల్‌ను నింపారని 'బీజింగ్ న్యూస్' గతవారం వెలువరించిన వార్తా కథనం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. దీంతో వంట నూనెల సరఫరాపై చైనా అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.

ఆడతోడు కోసం 1.3 కిలోమీటర్లు ఈదిన మగసింహాలు

న్యూఢిల్లీ: ఆడతోడు కోసం అలమటించి పోయిన రెండు సోదర సింహాలు ఓ నదిని 1.3 కిలోమీటర్లు ఈది అవతలి ఒడ్డుకు చేరుకున్నాయి. ఉగాండాలోని క్వీన్ ఎలిజబెత్ నేషనల్ పార్క్‌లో జరిగిందీ ఘటన. ఆ నది మొత్తం మొసళ్లు, నీటి ఏనుగులతో నిండి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ లెక్కచేయకుండా ఈదాయి. రెండు సింహాలలో ఒక టైన జాకబ్ క్వీన్ ఎలిజబెత్ పార్కులో పదేండ్లుగా నివసిస్తున్నది. ఇది వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని కాలు కోల్పోయింది. అయినప్పటికీ సోదర సింహంతో కలిసి రెండు సరస్సులను కలిపే జలమార్గాన్ని విజయవంతంగా దాటింది. పార్కులో ఆడసింహాల కోసం విపరీతమైన పోటీ ఉంది. ఈక్రమంలో ఓ ఆడతోడు కోసం మరో మగ సింహాల గుంపుతో పోరాడి ఓడిపోయాయి. ఆ తర్వాత ఇవి రెండూ నదికి ఆవలివైపున ఉన్న ఆడ సింహాల కోసం ప్రమాదకరమైన ప్రయాణం చేసి ఉండొచ్చని